నిరుద్యోగులకు కుచ్చుటోపీ

- మరోసారి నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లిన కూటమి సర్కార్
- ఎన్నికలకు ముందు నెలకు రూ.3 వేలు భృతి ఇస్తామని హామీ
- బడ్జెట్లో నిధులు కేటాయించకపోవడంపై యువత ఆగ్రహం


డీఎస్సీ కోచింగ్ తీసుకుంటున్న నిరుద్యోగ యువత (ఫైల్)

యలమంచిలి: నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే వరకూ నెలకు రూ.3 వేల చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న కూటమి నేతలు ఆ హామీకి మంగళం పాడారు. గద్దెనెక్కి తొమ్మిది నెలలు గడుస్తున్నా ఆ హామీ అమలుపై ఒక్క అడుగూ ముందుకు పడలేదు. పాలకొల్లు నియోజకవర్గంలో దాదాపుగా 20 వేల మంది నిరుద్యోగులు ఉన్నారు. 2014లో చంద్రబాబు హామీలను నమ్మి మోసపోయినట్లు 2025 లోనూ నిరుద్యోగులు మరోసారి మోసపోయారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని, ఇంటికో ఉద్యోగం, ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలు.. ఐదేళ్లలో మొత్తంగా 20 లక్షల ఉద్యోగాలు, ఉద్యోగం రాకపోతే నిరుద్యోగ భృతి నెలకు రూ.3,000 చొప్పున ఇస్తామని మేనిఫెస్టోలో పేర్కొన్నారు. ఇదే విషయాన్ని ఇంటింటికీ తిరిగి విస్తృతంగా ప్రచారం చేశారు. సూపర్ సిక్స్ పథకాల్లో ప్రధానంగా చూపించారు. గడపగడపకూ తిరిగి కరపత్రాలు పంచిపెట్టి నిరుద్యోగుల్లో విపరీతంగా ఆశలు పెంచారు. ఎన్నికల సమయంలో పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ అనే నిబంధనలు ఏవీ చెప్పకుండా నిరుద్యోగ భృతి ఇస్తామనడంతో అంతా నమ్మారు. కూటమి అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు గడుస్తున్నా నిరుద్యోగ భృతిపై ఒక్కరూ నోరు మెదపడం లేదు. సూపర్ సిక్స్ హామీల్లో ప్రధానమైన ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతిపై బడ్జెట్లో సైతం ఎలాంటి ప్రకటన లేదు. కనీసం ఈ పథకం అమలుపై విధి విధానాలు, మార్గదర్శకాలు విడుదల చేయకపోవడంపై చదువుకున్న యువకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2014లో రూ.2000 నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి మాట తప్పినట్టుగానే 2024లోనూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అదే ధోరణి ప్రదర్శిస్తుండంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కూటమి ప్రభుత్వం బేషరతుగా చదువుకున్న ప్రతి ఒక్కరికీ నిరుద్యోగ భృతి ఇవ్వాలని యువతీ యువకులు డిమాండ్ చేస్తున్నారు.

జాబ్ క్యాలెండర్ ఎక్కడ?

గ్రామీణ ప్రాంతాల్లోని యువత కోచింగ్ సెంటర్లో ప్రభుత్వ ఉద్యోగాల కోసం సంవత్సరాల తరబడి చదువుకుంటున్నారు. కుటుంబాలకు ఆర్థికంగా భారంగా మారినప్పటికీ ప్రభుత్వం ఇచ్చే భృతి అండగా నిలుస్తుందని గంపెడాశలు పెట్టుకున్నారు. జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తే ఎక్కువ శాతం డిగ్రీ, పీజీ చేసిన యువత గుంటూరు, విజయవాడ, హైదరాబాద్ వంటి నగరాలలో స్టడీ సెంటర్లలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారు. ప్రమాణ స్వీకారం రోజున మెగా డీఎస్సీపై తొలి సంతకం చేసి, ఇప్పటి వరకు డీఎస్సీ నిర్వహించకుండా కోచింగ్ సెంటర్లలో మగ్గుతున్న యువతకు చుక్కలు చూపుతున్నారు. ఈ తొలి సంతకాన్ని నమ్మి అభ్యర్థులు గుడ్లవల్లేరు, విజయవాడ, కాకినాడ, రాజమండ్రి తదితర నగరాలలోని కోచింగ్ సెంటర్లలో నెలల తరబడి కోచింగ్ తీసుకుంటున్నారు. అయితే ప్రభుత్వం టెట్‌తో సరిపెట్టి ఇప్పటి వరకు డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయలేదు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించిన నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

మోసం చేయడం బాబుకు అలవాటే



నిరుద్యోగ భృతి, ఇంటికో ఉద్యోగం అంటూ మోసం చేయడం చంద్రబాబుకు అలవాటుగా మారింది. ఇదే హామీలు 2014లో కూడా ఇచ్చారు. ఏనాడూ చెప్పిన హామీలను నెరవేర్చిన పాపానపోలేదు. ఎన్నికల ముందు తూతూ మంత్రంగా ఇచ్చామనే పేరుకే హామీలు అమలు చేస్తున్నారు. నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుకోకుండా ఉద్యోగాలు వచ్చే వరకైనా కచ్చితం నిరుద్యోగ భృతి చెల్లించాలి.
– పాలపర్తి సందీప్, ఏనుగువానిలంక

ఇంటికో ఉద్యోగం కల్పించాలి



టీడీపీ మేనిఫెస్టోలో ప్రకటించినట్లు ఇంటికో ఉద్యోగం కల్పించాలి. దీనికి సంబంధించిన జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి. నిరుద్యోగులు ఆర్థికంగా ఇబ్బంది పడకుండా ప్రతి నెలా రూ.3 వేల నిరుద్యోగ భృతి మంజూరు చేయాలి. నిరుద్యోగ భృతి విడుదల చేస్తే ఉద్యోగాల కోసం కోచింగ్ సెంటర్లకు వెళ్లే పేద విద్యార్థులకు అనుకూలంగా ఉంటుంది.
– మామిడిశెట్టి చిట్టిబాబు, వడ్డిలంక

ఎన్నికల హామీ నిలబెట్టుకోవాలి



నేను డిగ్రీ పూర్తి చేశా. డీఎస్సీకి ప్రిపేర్ అవుతున్నా. నిరుద్యోగ భృతి ఇస్తే శిక్షణకు ఉపయోగపడుతుంది. కూటమి ప్రభుత్వం వచ్చి 9 నెలలు దాటుతున్నా నిరుద్యోగ భృతి ఇవ్వలేదు. కనీసం ఇస్తారో? లేదో? కూడా చెప్పడం లేదు. అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలను పట్టించుకోకపోవడం సమంజసం కాదు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలి.
– వలవల లీలారత్నం, పాలకొల్లు

దళితుల సమస్యలను అసెంబ్లీలో చర్చించాలి


నన్నేటి పుష్పరాజ్

పెనుగొండ: దళిత వాడల్లో పెరిగిపోతున్న సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో దళిత సమస్యలపై, దళితుల ఆర్థిక స్థితిగతులపై దళిత ప్రజాప్రతినిధులు అసెంబ్లీలో గళమెత్తి వారి సమస్యలను తీర్చేలా చర్చ చేయాలని పేర్కొన్నారు. ప్రజలు ఇచ్చిన తీర్పును అసెంబ్లీలో ఎక్కువ సమయం ప్రజా సమస్యలపై పోరాటం చేసేలా ఉండాలని, అంతేగానీ ప్రజాప్రతినిధులు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుని ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యంగా దళిత వాడల్లో మంచినీరు సదుపాయం ఉండేలా ఏర్పాటు చేయాలని, డ్రెయినేజీ, రోడ్ల సమస్యల పరిష్కారానికి ప్రతి నియోజకవర్గంలో ఎమ్మెల్యే నివేదిక రప్పించుకుని యుద్ధ ప్రాతిపదికన పనులు చేసేలా ఏర్పాట్లు చేయాలని కోరారు. రానున్న రోజుల్లో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు నూరు శాతం ఖర్చు చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రేపు ఫెమినా క్లబ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలోని పాలకొల్లు ఫెమినా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షురాలు ఎం.ఉమ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. శనివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి లయన్స్ క్లబ్‌లో చిరుధాన్యాల వంటకాలు, వేసవి పానీయాలు, శారీస్ స్టైలింగ్, మోడ్రన్ హెయిర్ స్టైలింగ్ పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే మహిళలు ముందుగా పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.

క్లుప్తంగా

పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు


గాలికుంటు వ్యాధి రాకుండా టీకా వేస్తున్న పశువైద్య సిబ్బంది

యలమంచిలి: మండలంలోని కాజ పడమర, కొంతేరు గ్రామాల్లోని 62 ఆవులు, 187 గేదెలకు గురువారం గాలి కుంటు వ్యాధి (గాళ్ల వ్యాధి) రాకుండా పశు వైద్య సిబ్బంది టీకాలు వేశారు. ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించిన మండల పశు వైద్యాధికారి డాక్టర్ పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ ఈ టీకాలు ప్రతి రోజూ ఉదయం 6 గంటల నుండి 10 గంటల వరకు వేస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని పాడి రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

డ్రెయిన్లను ప్రతిరోజూ శుభ్రం చేయాలి


డ్రెయిన్లను శుభ్రం చేసే పనులను పరిశీలిస్తున్న కమిషనర్

నరసాపురం: పట్టణంలోని అన్ని వార్డుల్లో డ్రెయిన్లను ప్రతిరోజూ శుభ్రం చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య సంబంధిత అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. గురువారం కమిషనర్ పట్టణంలోని పలు వార్డుల్లో పర్యటించి డ్రెయినేజీలు, పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. వేసవి సమీపించిన దృష్ట్యా వార్డుల్లో డ్రెయిన్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. దోమలు పెరగకుండా డ్రెయిన్లను శుభ్రం చేయాలన్నారు. పారిశుద్ధ్య సిబ్బంది విధుల్లో అలసత్వం చూపిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యార్థులకు పరీక్షల సామగ్రి అందజేత


పరీక్షల సామగ్రిని అందజేస్తున్న ఏనుగువానిలంక వంశీ రామ్‌కుమార్

యలమంచిలి: ఏనుగువానిలంక హైస్కూల్ నుంచి పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ఒరిస్సా ఆహార సొసైటీ ఇన్‌చార్జి ఏనుగువానిలంక వంశీ రామ్‌కుమార్ గురువారం పరీక్షల సామగ్రిని అందజేశారు. ఆయన కుటుంబ సభ్యుల సంస్మరణార్థం విద్యార్థులకు ఈ కిట్ అందజేసినట్లు ఆయన వివరించారు. ఉపాధ్యాయుల కోరిక మేరకు పాఠశాలకు డిజిటల్ ప్రింటర్ ఇస్తానని వంశీ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు పాఠశాల హెచ్‌ఎం ఎస్ఎస్‌వీ అవధాని, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వంశీ స్నేహితులు ఎంవీ అరవింద్, బండి ప్రసాద్, మల్లాడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పీ-4 సర్వేపై శిక్షణ


పెనుగొండ ఎంపీడీఓ కార్యాలయంలో పీ-4 శిక్షణ ఇస్తున్న దృశ్యం

పెనుగొండ: ప్రభుత్వం నూతనంగా ప్రారంభించనున్న పీ-4 సర్వేపై పెనుగొండ ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఒకరోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎంపీడీవో టి.సూర్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సూర్యనారాయణ మూర్తి మాట్లాడుతూ సర్వే పక్కాగా జరగాలని తెలిపారు. ఇంటిలోని వారు లేకపోతే మరోసారి వెళ్లాలని తెలిపారు. వలస వచ్చిన వారు ఉంటే కొత్త సచివాలయంలో నమోదు చేయాలన్నారు. వాహనం, విద్యుత్ వంటి వాటి వివరాలు పరిశీలించి నమోదు చేయాలన్నారు.

రేపు ఆచంట మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

పెనుగొండ: ఆచంట మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వి.పూర్ణబాబ్జీ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 3 గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ దిగమర్తి సూర్యకుమారి అధ్యక్షతన సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశానికి సభ్యులతో పాటు, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

బంగారం సమర్పణ

భీమవరం(ప్రకాశం చౌక్): పట్టణంలోని మావుళ్లమ్మ అమ్మవారికి గురువారం కోలమూరుకు చెందిన కూనపరాజు బాలాజీ రాజు దంపతులు 7 గ్రాముల బంగారం సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ మద్దిరాల మల్లికార్జున శర్మ ప్రత్యేక పూజలు చేశారు. అలాగే వారికి శేషవస్త్రం ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ పాల్గొన్నారు.

రోడ్డు పక్కన నిర్మాణాలతో విస్తరణపై అనుమానాలు


జేజేఎల్ఎం నిధులతో రహదారి పక్కనే నిర్మించిన సంపు, మైక్రో ఫిల్టర్

నరసాపురం రూరల్: కొంత మంది స్వార్థంతో పాటు అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వ నిధులు దుర్వినియోగం అవుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. మండలంలోని కొత్త నవరసపురం గ్రామంలో పూర్వం నిర్మించిన 60 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన ఓవర్‌హెడ్ ట్యాంకు శిథిలావస్థకు చేరింది. దీని స్థానంలో ఓవర్‌హెడ్ ట్యాంకు, 40వేల లీటర్ల సంపు, 5 లక్షల లీటర్ల మైక్రో ఫిల్టర్‌ల నిర్మాణానికి గత ప్రభుత్వ హయాంలో జలజీవన్ మిషన్ నిధులు రూ.5 లక్షలు మంజూరయ్యాయి. ఇదిలా ఉండగా నరసాపురం నుంచి పాలకొల్లు ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి యలమంచిలి మండలం మేడపాడు వరకూ రోడ్డు నిర్మాణానికి గత ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరు కాగా రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ రోడ్డు పనులు వివిధ దశల్లో ఉన్నాయి. ఈ రోడ్డును విస్తరించి నిర్మించేందుకు కొత్త నవరసపురం గ్రామంలో కొంత భూ సేకరణ చేయాల్సి ఉంది. అయితే ఈ రోడ్డును ఆనుకునే జలజీవన్ మిషన్ నిధులతో చేపట్టిన ఈ నిర్మాణాలు రోడ్డు విస్తరణకు ఆటంకం కలుగుతుందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.

గ్రామీణ ప్రజలకు మరిన్ని సేవలు


పోస్టుఉమెన్ ఎన్.శిరీషను అభినందిస్తున్న హరికృష్ణ ప్రసాద్

పెనుమంట్ర: గ్రామీణ ప్రజలకు తపాలాశాఖ ద్వారా బ్యాంకింగ్, ఇన్సూరెన్స్ పథకాలను మరింత అందుబాటులోకి తీసుకువచ్చినట్లు భీమవరం డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ కె హరికృష్ణ ప్రసాద్ అన్నారు. గురువారం పెనుమంట్ర సబ్ పోస్టాఫీస్ పరిధిలో తపాలా సిబ్బందికి ఖాతాదారులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. తపాలాశాఖ ద్వారా కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెట్టి తపాలాశాఖ ద్వారా అమలు చేస్తుందని, ప్రతి గ్రామంలో ప్రజలకు, ఖాతాదారులకు తమ ఇంటివద్దనే సేవలు అందించే స్థాయికి తపాలాశాఖను తీర్చిదిద్దామన్నారు. ఈ సందర్భంగా భీమవరం డివిజన్‌లో అధిక మొత్తం బీమా ప్రీమియం సేకరించిన పెనుమంట్ర పోస్టు ఉమెన్ ఎస్.శిరీషను అభినందించారు. ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర స్థాయిలో తిరుపతిలో జరిగే సదస్సులో చీఫ్ పోస్టుమాస్టర్ జనరల్ చేతులు మీదుగా ఉత్తమ పోస్టు ఉమెన్ అవార్డు అందుకోనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో భీమవరం డివిజన్ అసిస్టెంట్ సూపరింటెండెంట్(ఆర్) ఎస్ఎస్‌వీఏకే కుమార్, తణుకు సబ్ డివిజన్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ సూర్య ప్రకాష్, వై.శివ ప్రసాద్, బి.వెంకటేష్, సబ్ పోస్టుమాస్టర్ నాగేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పురుగు మందుల షాపు ప్రారంభం


పురుగు మందుల షాపును ప్రారంభిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: రైతులకు నాణ్యమైన పురుగు మందులను సరసమైన ధరలకు అందించేందుకు నాబార్డు ఆధ్వర్యంలోని పురుగు మందుల షాపు దోహదపడుతుందని నరసాపురం వ్యవసాయశాఖ ఏడీ ఈదా అనిల్ కుమారి, నేషనల్ ఆగ్రో ఫౌండేషన్ డిప్యూటీ డైరెక్టర్ ప్రకాష్ అన్నారు. గురువారం నరసాపురం పట్టణంలో జాతీయ 10 వేల రైతు ఉత్పత్తిదారుల పథకం (ఎఫ్‌పీవో)లో భాగంగా పురుగు మందుల షాపును ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ఈ ఎఫ్‌పీఓ ద్వారా రైతులకు కలిగే ప్రయోజనాలను గురించి వివరించారు. కార్యక్రమంలో నరసాపురం రైతు ఉత్పత్తిదారుల సంఘ చైర్మన్ డాక్టర్ ఇలపకుర్తి సూర్య ప్రకాష్, స్టేట్ కో ఆర్డినేటర్ సునీల్ కుమార్, జిల్లా కోఆర్డినేటర్‌లు శివశంకర్, సతీష్, ఈశ్వర బ్రహ్మారెడ్డి, సీఈవో ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి అనధికారికంగా చెరువు పూడ్చివేత


చెరువుగట్టున గుట్టలుగా ఉన్న మట్టి


చెరువులోకి మట్టిని పూడ్చిన దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలోని యడ్లబజారు సెంటర్ నందు ఉన్న ఓ చెరువును ఓ వ్యక్తి అనదికారికంగా పూడ్చివేస్తున్నారు. స్థానిక యడ్లబజారు పెనుమదం రోడ్డు కనకదుర్గమ్మ ఆలయం, వెటర్నరీ ఆసుపత్రి ఎదురుగా ఉన్న ఓ చెరువును ఆ వ్యక్తి తన ఇష్టానుసారంగా అర్ధరాత్రి సమయంలో మట్టితో పూడ్చివేస్తున్నాడు. ఈ చెరువు టీఎస్ నెంబర్ 895/1లో 2.68 ఎకరాలు ఉంది. ఈ చెరువు కొందరు వ్యక్తులు మా సొంతం అని అంటారు. కొందరు వ్యక్తులు మాత్రం ఇది రెవెన్యూకు చెందిన చెరువని పూర్వం తమ పొలాలు, తోటల్లోకి నీటిని (రెవెన్యూ రికార్డుల్లో ఇది రైతువారీ డైరీగా నమోదై ఉన్నట్లు సమాచారం) ఉపయోగించుకోవడానికి రెవెన్యూ మాకు హక్కు కల్పిస్తూ పట్టాలు ఇచ్చిందని మరి కొందరు చెపుతున్నారు. పూర్వం దీనిపై పట్టాలు పొందిన వారు ఐదుగురు కుటుంబ సభ్యులుగా ఉన్నట్లు చెబుతున్నారు. ఆ ఐదుగురు కుటుంబ సభ్యుల్లో ఒకరైన ఓ కుటుంబ సభ్యుడు చెరువు పూడుస్తున్నట్లు వాటాదారులు చెపుతున్నారు. ఈ చెరువు ఏవరికి సంబంధించినదైనా గాని పూడ్చాలంటే మాత్రం రెవెన్యూ, మైనింగ్ అధికారుల అనుమతులు ఉండాలి. ఎవరి అనుమతులు లేకుండా యథేచ్ఛగా ఇష్టానుసారంగా రోడ్డు పక్కన పూడ్చుకుంటూ పోతున్నారు. సదరు వాటాదారుల్లో కొందరు దీనిపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయగా స్థానిక వీఆర్వో వచ్చి పూడుస్తున్న వ్యక్తులతో ఇక్కడ వేసిన మట్టి గుట్టలు వెంటనే తొలగించాలని హెచ్చరించినట్లు తెలిపారు. వీఆర్వో హెచ్చరికలను బేఖాతర్ చేస్తూ రాత్రి సమయంలో ఆ మట్టిని చెరువులోకి సర్దేశారు. అధికారులు హెచ్చరించినా సరే లెక్కచేయకుండా ప్రధాన రహదారి పక్కనే ఇలా పూడ్చి వేస్తుంటే ఉన్నతాధికారులు మాత్రం పట్టించుకోకుండా వదిలేశారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకుని వేసిన మట్టిని వెంటనే తొలగించాలని ఆ చెరువు వాటాదారుల్లో కొందరు డిమాండ్ చేస్తున్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన


ఏబీసీ కేంద్రం పనులను పరిశీలిస్తున్న ఆర్డీఓ దాసి రాజు

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో అతి త్వరలో యానిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నామని ఆర్‌డీఓ, పట్టణ స్పెషల్ ఆఫీసర్ దాసి రాజు అన్నారు. గురువారం పట్టణంలో పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా దాసి రాజు మాట్లాడుతూ పట్టణంలో వెటర్నరీ ఆసుపత్రి ప్రాంగణంలో ఏబిసి కేంద్రాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. రూ. 5 లక్షలు మునిసిపల్ నిధులతో ఈ నిర్మాణం కొనసాగుతుందన్నారు. దాదాపుగా ఎనిమిదేళ్ల క్రితం వెటర్నరీ ఆసుపత్రి వద్ద మునిసిపల్ డ్రెయినేజీ నిర్మాణం జరిగినప్పుడు ఆసుపత్రి ప్రహరీను తొలగించారు. అప్పటి నుండి ఆ ప్రహరీను నిర్మించలేదు. దీనిపై ఆసుపత్రి అధికారులు, స్థానిక నాయకులు దాసి రాజు దృష్టికి తీసుకువెళ్లారు. ప్రహరీ నిర్మాణానికి అంచనాలు తయారు చేసి నిర్మాణం జరిగేలా చర్యలు తీసుకోవాలని మునిసిపల్ కమిషనర్‌కు సూచించారు. అనంతరం రామగుండం పార్కు, రుద్రభూమి, రూరల్ పోలీస్‌స్టేషన్ రోడ్డు, 28వ వార్డు పైపులైన్ పనులు పరిశీలించారు. ఆర్డీఓ వెంట మునిసిపల్ కమిషనర్ బి.వి జయసారథి, వెటర్నరీ డాక్టర్ మల్లేశ్వరరావు, పెచ్చెట్టి బాబు, జివి తదితరులు ఉన్నారు.

మామిడి పంటపై మంచు ప్రభావం

నరసాపురం రూరల్: మామిడి పంటపై మంచు ప్రభావం అధికంగా ఉంటుందని ఉద్యానవన శాఖ సహాయకురాలు దీప్తి తెలిపారు. గురువారం మండలంలోని లక్ష్మణేశ్వరం గ్రామంలో మామిడి తోటలను ఆమె పరిశీలించారు. మామిడికి పూత సీజన్ కావడంతో పలు సస్యరక్షణ సూచనలు, సలహాలను ఈ సందర్భంగా ఆమె రైతులకు సూచించారు. పూత నలుపు రంగు వచ్చినప్పుడు తామర పురుగులు, తేనె మంచు పురుగు వ్యాపించకుండా ఉండేందుకు గానూ రెండు గ్రాముల ఫాస్ఫామిడాన్, రెండు గ్రాముల డైక్లోరోపాస్‌ల మందును రెండు లీటర్ల నీటికి కలిపి నెల రోజుల వ్యవధిలో రెండు పర్యాయాలు చెట్లపై పిచికారి చేయాలని సూచించారు.

దంత సంరక్షణపై అవగాహన


దంత సంరక్షణపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ చల్లా హేమంత్ మాధుర్

పాలకొల్లు సెంట్రల్: దంత వైద్యుల దినోత్సవం సందర్భంగా పాలకొల్లు, నరసాపురం పట్టణాలకు చెందిన దంత వైద్యులు పాలకొల్లు అంజలి మానసిక వికలాంగుల పాఠశాలలో గురువారం దంత వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు దంత సంరక్షణపై అవగాహన కల్పించారు. బ్రష్ చేయలేని వికలాంగులకు ఏ విధంగా బ్రష్ చేయించాలో? ఆయాలకు వివరించారు. అనంతరం వికలాంగ విద్యార్థులందరికీ బ్రష్‌లు అందజేశారు. కార్యక్రమంలో దంత వైద్యులు చల్లా హేమంత్ మాధుర్, రుద్రరాజు సాయి ఈశ్వర వర్మ, సంగినీడి కల్యాణి, కృష్ణ చైతన్య, మావూరి చేతన్ ఉదయ్ కిరణ్, కేఎస్ఎన్ రవి కల్యాణ్, కేఎస్ఎన్ భార్గవి, ఆకాజ్యోతి, మల్లుల జ్ఞానేశ్వరి, టీఎస్ఎస్ మణికంఠ కుమార్, మౌని, చరిష్మ, ఆశ, భార్గవి పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి


పాలకొల్లు సెంట్రల్: మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రాజరాజేశ్వరి

పాలకొల్లు సెంట్రల్: మహిళలు అన్ని రంగాల్లో ముందు ఉండాలని అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం నేపథ్యంలో సాధికారత విభాగం, తెలుగు విభాగం, ఐక్యూఏసీ ఆధ్వర్యంలో గురువారం కళాశాలలో సాహిత్య రూపకం ప్రదర్శించారు. ఈ సందర్భంగా రాజరాజేశ్వరి మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళలపై జరుగుతున్న దాడులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయులు డాక్టర్ వి.నాగరాజ్యలక్ష్మి, డాక్టర్ వి.సత్యవతి, డాక్టర్ ఎం.లలితకుమారి, బండ్లమూడి హనుమాయమ్మ, డాక్టర్ తాడేపల్లి వీరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


యలమంచిలి: బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలను వివరిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహ్మద్ హసీనా

బాల్య వివాహాలతో అనర్థాలు

యలమంచిలి: అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా గురువారం బాడవ అంగన్‌వాడీ కేంద్రంలో బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై తల్లులకు, కిశోర బాలికలకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహ్మద్ హసీనా అవగాహన కల్పించారు. ప్రతి కిశోర బాలికా జీవితంలో ఒక లక్ష్యం కలిగి ఉండాలని చెప్పారు. చదువు మీద శ్రద్ధ వహించి లక్ష్య సాధనకు చిత్తశుద్ధితో కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త చంద్రకళ, సహాయకురాలు ధనలక్ష్మీ స్కూల్ టీచర్ శ్రావణి తదితరులు పాల్గొన్నారు.